క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. నరసింహస్వామి గురువారం తెలిపారు. ఈనెల 17వ తేదీనుంచి 31వ తేదీవరకు ఈపాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం



కేసముద్రం/ దంతాలపల్లి : కేసముద్రం మున్సిపాలిటీలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడడంతో, స్తంభాలు ప్రధాన రహదారిపై పడ్డాయి. అదే విధంగా పలుచోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరి పడగా, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అలాగే దంతాలపల్లి మండలంలో అకాల వర్షం కురిసింది.మండలంలోని జాతీయ రహదారిపై చెట్టు విరిగి ధాన్యం లోడుతో వస్తున్న ట్రాక్టర్‌పై పడింది. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో సైతం అకాల వర్షం పడింది.

'డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి'



తొర్రూరు : పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ యాకూబ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో గల డబుల్ బెడ్రూం ఇళ్ల ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. 240 ఇళ్లు నిర్మించి పేదలకు కేటాయించకుండా వదిలేశారని తెలిపారు. నాయకులు దర్గయ్య, జమ్ముల శ్రీను, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి




నెల్లికుదురు : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన సంఘటన మండలంలోని నైనాలలో గురువారం చోటుచేసుకుంది. నైనాల పరిధిలోని సపావత్ తండా వద్ద ఉన్న వ్యవసాయ భూమిలో మేత కోసం వెళ్లిన ఆవు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది. దీంతో రూ.70వేల విలువ చేసే ఆవు మృతి చెందినట్లు బాధిత రైతు ఆకుల లింగయ్య తెలిపారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

మహబూబాబాద్ రూరల్/ గూడూరు : బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా గోవులను తరలించకుండా పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంబాలపల్లి గ్రామంలో, గూడూరు మండలంలోని భూపతిపేట జాతీయ రహదారి పక్కన గుంజేడు క్రాస్ వద్ద సీఐలు సర్వయ్య, జి.సూర్యప్రకాశ్ గురువారం చెక్‌పోస్టులను ప్రారంభించారు. రూరల్ ఎస్సై దీపిక, నరేశ్, హెడ్ కానిస్టేబుల్ వీరన్న, కానిస్టేబుళ్లు విజయ్, బాలరాజు, సోమమల్లు, గూడూరు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి, పీఎస్సై కోటేశ్వర్‌రావు, ఏఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై ధరల పిడుగు

- జీలుగ, జనుము, పిల్లి పెసర, బీపీటీ, ఎంయూటీ విత్తనాల ధరలు పెంపు



జీలుగ విత్తనాలు



జనుము విత్తనాలు



పిల్లి పెసర

మహబూబాబాద్ రూరల్ : పచ్చిరొట్ట విత్తన ధరలు గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా రెట్టింపయ్యాయి. దీంతో రైతులపై ధరల పిడుగుపడి అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది. గతేడాదిలో జీలుగ, జనుము, పిల్లి పెసర, బీపీటీ, ఎంయూటీ విత్తనాల ధరలు ప్రస్తుతం రెండింతల రెట్టింపు అయ్యాయి. యాసంగి పంట కోతలు పూర్తయిన సందర్భంగా రైతులు దుక్కులు దున్నడం మొదలుపెట్టి తొలకరి మొదలవగానే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచనల మేరకు భూసారం పెంచుకునేందుకు పచ్చిరొట్ట సాగు చేస్తారు. అలాంటి విత్తనాల ధరలను పెంచడంతోపాటు ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు ఇచ్చే సబ్సిడీలో కూడా కోత విధించింది. గతేడాది పచ్చిరొట్ట విత్తనాలకు నిర్ణయించిన ధరలో 60 శాతం ప్రభుత్వం భరించి 40 శాతం రైతు భరించేవారు. ప్రభుత్వం 50 శాతం వరకే పరిమితి విధించింది. దీంతో రైతులపై అధిక మొత్తంలో ఆర్థిక భారం పడనుంది. ఒక్కసారిగా ధరలు పెంచడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పచ్చిరొట్ట వేయాలా వద్దా అనే ఆలోచనకు వస్తున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

జీలుగ 30 కిలోల బస్తా గతేడాది రూ.1,116 ఉండగా ప్రస్తుతం రూ.2,137.50కి పెంచారు. అంటే రూ.1,021.50 పైసలు ధర (91.50శాతం) అదనంగా పెరిగింది. జనుము 40 కిలోల బస్తా రూ.1,448 ఉండగా ఈ ఏడాది రూ.2,510కి పెంచారు. పిల్లి పెసర 20 కిలోల బస్తా గతేడాది రూ.1,084 ఉంటే ఈ ఏడాది రూ.2,055కు పెంచారు. అనగా రైతులపై అదనంగా రూ.971 (89.50 శాతం) భారం పడనుంది. బీపీటీ-5,204 రకం 25 కిలోల బస్తా గతేడాది రూ.1,033 ఉండగా ఈ ఏడాది రూ.1,137.50కు పెంచారు. ఎంయూటీ-1224 రకం 25 కిలోల బస్తా గతేడాది రూ.987.50 ఉండగా ఈ ఏడాది రూ.1,075కు చేరుకుంది. దీంతో రైతులపై రూ.87.50 భారం పడనుంది.

సబ్సిడీ కోతతో భారం



ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర, బీపీటీ, ఎంయూటీ విత్తనాల ధరలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. రైతులకు మేలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాల ధరల పెంపుతో వారిపై ఆర్థిక భారం మోపడం ఎందుకు. ప్రభుత్వం ఏకంగా రెండింతలు ధరలు పెంచడమే కాకుండా పైగా సబ్సిడీలో కూడా కోత విధించడం రైతులపై భారం వేయడమే అవుతుంది.

- లూనావత్ అశోక్, కస్నాతండా, గుండాలగడ్డతండా

పచ్చిరొట్ట ధరలు తగ్గించాలి



ప్రతి ఏటా భూసారం పెరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయమని చెబుతుంటుంది. దీంతో రైతులంతా జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు వేసి వాటిని భూమిలో కలియదున్ని పంటల సాగు మొదలు పెడుతుంటారు. అలాంటిది ప్రభుత్వం ధరలు పెంచడం వల్ల చాలామంది పేద రైతులపై ఎంతో భారంపడి వారు ఇబ్బందికి గురవుతారు.

- జక్కుల సుధాకర్, ఆమనగల్

విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీపై పోరాడాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

కురవి : మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ విధానాలపై పోరాటం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అయ్యగారిపల్లిలో సీపీఐ మండల తొమ్మిదో మహాసభలు జరిగాయి. పార్టీ పతాకాన్ని నల్లు అమృతరెడ్డి ఆవిష్కరించగా బుర్ర సమ్మక్క, బొల్లం ఉప్పలయ్య అధ్యక్షతన మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూటకో పార్టీ మారుస్తూ అధికారం ఎక్కడ ఉంటే అక్కడ వాలే రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. సీపీఐకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు. సీపీఐ నూతన కమిటీని ప్రకటించారు. మండల కార్యదర్శిగా కరణం రాజన్న, సహాయ కార్యదర్శిగా బుర్ర సమ్మయ్యతోపాటు 21 మందిని ప్రకటించారు. కార్యక్రమంలో నెల్లూరు నాగేశ్వర్‌రావు, దొంతు రామ్మూర్తి, బొల్లు వెంకన్న, తురక రమేష్, కలగూర నాగరాజు, నర్సింగం గుర్వయ్య, బస్వ కొమురయ్య, రామగోని రవి, దూదికట్ల సారయ్య, కందుల యాకయ్య, నల్లు మధుసూదన్‌రెడ్డి, సాయి, మహేష్ పాల్గొన్నారు.

దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- వీరభద్ర స్వామివారికి రాకేష్‌రెడ్డి పూజలు



కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల గుర్తింపు వేగవంతం



సమీక్షలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ పురుషోత్తం

డోర్నకల్ : ఇందిరమ్మ పథకంలో రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసినట్లు జెడ్పీ సీఈఓ, ఇందిరమ్మ పథకం నియోజకవర్గ ప్రత్యేక అధికారి పురుషోత్తం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ పథకంపై సమీక్ష నిర్వహించగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్ కింద 200 ఇళ్లు మంజూరు చేశామని ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో 3,300 ఇళ్లు మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక వేగవంతంగా జరుగుతుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి బ్యాంకులకు పంపినట్లు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కురవి : తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న బొడ్డు రాంబాబు గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. రాజోలుకు చెందిన రాంబాబు బైక్‌పై ఖమ్మం రోడ్డు నుంచి కురవికి వస్తున్నాడు. అదే మార్గంలో ఖమ్మం నుంచి కురవి వైపునకు గ్రానైట్‌ను తరలించే ఖాళీ లారీ వస్తోంది. ఈ క్రమంలో ఏకలవ్య మోడల్ స్కూల్ ఎదురుగా లారీ, బైక్ ఒకే మార్గంలో వస్తూ ఒకదానికొకటి తగలడంతో బైక్‌పై నుంచి రాంబాబు కింద పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. స్థానికులు అతడిని ఆటోలో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. లారీ డ్రైవర్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లారీని అప్పగించాడు. ఈ సంఘటనపై ఎవరు ఫిర్యాదు చేయలేదని పీఎస్సై కృషారెడ్డి తెలిపారు.

'బ్రిడ్జి నిర్మించే వరకూ పోరాటం ఆగదు'



ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కురవి : మండలంలోని బేగావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బ్రిడ్జిని నిర్మించే వరకూ పోరాటం ఆగదని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ అన్నారు. గురువారం తండాలో ధర్నా నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తండావాసులు కర్నావత్ నాగరాజు, బేతావత్ బాలాజీ, రవి, శంకర్, మోహన్, వినోద్, విజేందర్, భగవాన్‌దాస్, వాల్య, శ్రీను, భూక్య దీప్లా, జర్పుల రామోజీ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘం డబ్బులు వాడుకున్నారంటూ ఆందోళన



కేసముద్రం: బ్యాంకులో జమచేయాల్సిన డబ్బులను ఓ సీఏ సొంతానికి వాడుకున్నట్లు ఆరోపిస్తూ డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆందోళనకు దిగిన సంఘటన గురువారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్ ఎదుట చోటుచేసుకుంది. సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన ఝాన్సీ మహిళా గ్రూపు బ్యాంకులో రూ.10లక్షల రుణాన్ని తీసుకుంది. ఈ రుణానికి గానూ బ్యాంకులో నెలనెలా కిస్తీల డబ్బులను జమ చేయాల్సి ఉంది. సభ్యులు ప్రతీ నెల డబ్బులను సీఏకు అందజేస్తున్నారు. కాగా ఆ డబ్బులను సీఏ బ్యాంకులో రెండేళ్లుగా జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు సభ్యులు ఆరోపించారు. ఇప్పుడు కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్లగా ఇంకా రూ.8.46లక్షలు బకాయి ఉందని బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. ఈ విషయమై ఏపీఎం రాజీర్‌ను వివరణ కోరగా గ్రూపు డబ్బులు బ్యాంకులో జమచేయని విషయం సభ్యులు తమ దృష్టికి తీసుకొచ్చారని దీనిపై పూర్తి స్థాయిలో విచారించడం జరుగుతుందన్నారు.

నేటినుంచి ఆధ్యాత్మిక శిక్షణ

మహబూబాబాద్ రూరల్ : మానుకోట మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో తెలుగు నీతి పద్యాలు, మహాభారత శ్లోకాలు మొదలగు ఆధ్యాత్మిక విషయాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పున్నంచంద్ మాల్పాని గురువారం తెలిపారు. వివరాలకు 98496 84050 నంబరులో సంప్రదించాలన్నారు.

వ్యక్తిపై దాడి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సికింద్రాబాద్ తండా పంచాయతీ పరిధిలో గల వెంకట్‌రెడ్డి పల్లెలో కేదాసు శ్రీకాంత్ అనే వ్యక్తిపై అతడి బంధువు శ్రీను గురువారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.

జామాయిల్ తోట దగ్ధం

దంతాలపల్లి : మండలంలోని దాట్ల గ్రామంలో గురువారం సాయంత్రం జామాయిల్ చెట్లకు నిప్పంటుకుంది. గ్రామానికి చెందిన రైతులు పేర్ల చంద్రయ్య, మద్దయ్య, వెంకన్న, పెద్దగురుస్వామి, పుల్లయ్యకు చెందిన జామాయిల్ తోటలో సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చెట్లు కాలిపోయాయి.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని చేపట్టిన ఉద్యమంలో భాగంగా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వామపక్ష నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్‌సారథిరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి, సీపీఐ(ఎంఎల్) డివిజన్ కార్యదర్శి హలావత్ లింగ్యా డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యమ కేసులో భాగంగా వామపక్ష పార్టీల నేతలు గురువారం కోర్టుకు హాజరయ్యారు. పెరుగు కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు నాగయ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'సిబిల్ స్కోర్ నిబంధన సరికాదు'

గార్ల : రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధన విధించడం సరికాదని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ ప్రభుత్వాన్ని అన్నారు. గురువారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక విధాలుగా మానసిక క్షోభకు గురుతున్నారన్నారు. ఈ సమావేశంలో గిన్నారపు, మురళి, ఎం రాములు, మాగం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

నెల్లికుదురు : మండలంలోని నర్సింహుగూడెం గ్రామ పరిధిలోని కోరగుట్టలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం, జాతరను వైభవంగా నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు ఎడ్లబండ్లతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన లక్ష్మీనారాయణ బ్రహ్మోత్సవాలు

గూడూరు : మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీనారాయణస్వామి అధ్యయనోత్సవ, వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అర్ధరాత్రి ముగిశాయి. రాత్రి 10 గంటలకు శేషవాహన సేవ పురవీధుల్లో ఊరేగి అలయం చేరుకోగా, కల్యాణ మండపంపై వేదమంత్రాలతో శ్రీ పుష్పయాగము పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్ తెలిపారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మజ్దూర్ యూనియన్ ర్యాలీ

డోర్నకల్ : రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల నామినేషన్ల దాఖలును పురస్కరించుకుని గురువారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏడీఈఎన్ కార్యాలయంలో జరిగిన రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల నామినేషన్ల దాఖలు సందర్భంగా మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుంచి ఏడీఈఎన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నామినేషన్లు దాఖలు చేశారు.

ఆకేరు చుట్టూ కందకాలు

నెల్లికుదురు: మండలంలోని ఆకేరు వాగు పరిధిలోని రామన్నగూడెం, బ్రాహ్మణకొత్తపల్లి, మామిడితోట, రామోజీతండా, భగ్న తండాల్లో కందకాలు తీయించినట్లు తహసీల్దార్ కోడిచింతల రాజు గురువారం తెలిపారు.

నామినేషన్ పత్రాల అందజేత

గంగారం : కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని పెనక పురుషోత్తం కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సంస్థాగత కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు రవలిరెడ్డికి నామినేషన్ పత్రాన్ని ఆయన అందించారు.

ప్రతిభ విద్యార్థులకు సన్మానం

మహబూబాబాద్ అర్బన్ : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఏసీజీఈ మందుల శ్రీరాములు హాజరై మాట్లాడారు. అనంతరం 15 ప్రభుత్వ పాఠశాలల టాపర్లను రూ.1,016ల నగదు బహుమతి, మెమొంటోతో విద్యార్థులను తల్లిదండ్రులను ఉపాధ్యాయులను సత్కరించారు. అధ్యక్షుడు మల్లయ్య, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, కోశాధికారి తండ సదానందం, ఉపాధ్యక్షులు నల్లు సుధాకర్ రెడ్డి, రవీంద్ర గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విచారణ

దంతాలపల్లి : రైతుల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ సునీల్‌కుమార్, నర్సింహులుపేట తహసీల్దార్ నాగరాజు గురువారం పేర్కొన్నారు.

మోదీవి ఓటు బ్యాంకు రాజకీయాలు



నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్, పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : ప్రధానమంత్రి మోదీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని, ప్రజలు ఆయనకు బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కాల్పుల విరమణలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైహింద్ పేరుతో గురువారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో శంతన్ రామరాజు, బానోత్ హరిసింగ్, మిట్టకంటి రామిరెడ్డి, ఎడ్ల రమేష్, ఖలీల్, భువనగిరి గిరిధర్ గుప్తా, పద్మం ప్రవీణ్ కుమార్, బండి శ్రీహరి, ఆరెందుల వెంకటేశ్వర్లు, భూక్య శ్రీను, అజ్మీర సురేష్, సిరిపురం వీరన్న, అంబటి మహేందర్ రెడ్డి, నాళ్ల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండలం రాములు తండాకు చెందిన నూనావత్ వినోద విద్యుదాఘాతంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును మురళీనాయక్ గురువారం అందజేశారు. విద్యుత్ శాఖ డీఈ పి.విజయ్, చిట్టెం వెంకన్న, నీరుటి లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే చర్యలు తప్పవు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్ : బీజేపీ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడితే వారు గ్రామాల్లో తిరగలేరని వారిపై చర్యలు తప్పవని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ..ఈటల రాజేందర్ ఇంటిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు విచక్షణను కోల్పోయి భౌతికంగా దాడికి దిగడం ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంత దిగజారి మాట్లాడుతున్నాడో రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు విలువలు విచక్షణను కోల్పోయి అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తే బీజేపీ నాయకులు కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని కాంగ్రెస్ పార్టీ నాయకులు గమనించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్ సుందర్ శర్మ, చీకటి మహేష్, సతీష్, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకన్న

గూడూరు : పంటల మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ వి.వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని అయోధ్యపురంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం, రసాయనిక ఎరువుల వాడకం పద్ధతి, పంట మార్పిడి, సాగునీటి పద్ధతులు, సుస్థిర వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై వివరించారు. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించాలని, తద్వారా అవసరమైన ఎరువుల వాడకంతో నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత డాక్టర్ వీరన్న, ఏఓ అబ్దుల్‌మాలిక్, సంఘం అధ్యక్షుడు భీరం సురేందర్‌రెడ్డి, రైతులు, ఏఈఓ, వ్యవసాయ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హుల జాబితా వెంటనే ప్రకటించాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గార్ల : ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను ప్రకటించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికకు అధికారులు ఇప్పటికీ నాలుగు సార్లు సర్వే చేపట్టారని, అయినా నేటికీ అర్హుల జాబితాను ప్రకటించక పోవడం విచారకరం అన్నారు. ఎన్నికల ముందు అర్హులకు రేషన్ కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ నేటికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు 200 రోజులకు పెంచాలని, పని ప్రదేశాల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వడదెబ్బకు గురై మృతిచెందిన కూలీలకు ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, భీముడు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొమ్మన్న

నెహ్రూసెంటర్ : నకిలీ విత్తనాలు, ఎరువులను నియంత్రించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ననప పొమ్మన్న, బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులకు నకిలీ, ఎరువులు, విత్తనాలను అంటగడుతున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో తెగిపోయిన చెరువులు, కుంటల మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని దోపిడీని అరికట్టాలని తెలిపారు. రైతు, కార్మిక వ్యతిరేక బీజేపీ విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆలకుంట్ల సాయిలు, భాస్కర్‌రెడ్డి, బాలయ్య వెంకన్న, రంగయ్య లింగ్యా పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కేసముద్రం : ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు సెంటర్‌లో పనిచేస్తున్న హమాలీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. వేటగాని శ్రీనివాస్, వంశీ, జాన్సన్, రాములు, నరసయ్య, రాములు, రాములు, ఉపేందర్ పాల్గొన్నారు.

బయ్యారం : కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదార్ పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని పలు పెంకు పరిశ్రమల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లింగ్య, ఆదినారాయణ, కోటయ్య, పాషా, సక్రు, దుర్గారావు, సతీష్, శ్రీను, రాజు, భాస్కర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బయ్యారం : మండలంలోని వెంకట్రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు ప్రభాకర్, ప్రసాదరావు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వెంకన్న, సాధ్విమణి, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, మురళి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.